
VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

# కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 245
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
మంగళవారం 10 ఫిబ్రవరి 2026



## సేవారత్న అవార్డు గ్రహీతకు శుభాకాంక్షలు



శ్రీ చిన్ని రామసత్యనారాయణ గారు
అధ్యక్షులు : ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ



1. 16-10-2009 న కర్నూలు జిల్లా మాన్దొడ్డి గ్రామంలో తుఫాను బాధితులకు 1.50,000 విలువగల నిత్యావసర సరుకులు, బియ్యము, బట్టలు పప్పులు 350 కుటుంబాలకు రేషన్ కార్డు ద్వారా వాలంటీర్లను పంపించి పంచడం జరిగింది.
2. 31-01-2013 న వత్సవాయి ఆర్యవైశ్య మండల అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత 1997లో వత్సవాయిలో ఆగిపోయిన ఆర్యవైశ్య కళ్యాణ మండపాన్ని డెవలప్ చేసి వాసవి నవ ఉపాలయాల క్షేత్రం అయ్య గారు ఉంటానికి ఇల్లు రెండు కోట్ల 30 లక్షలు రూపాయలు ఖర్చుతో నిర్మించటం జరిగింది. దానిలో భారీ ఎత్తున మీ సొంత నిధులు వెచ్చించటం జరిగింది.
   8-12-2014వ తారీకున ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య గారి చేతుల మీదగా కళ్యాణ మండపం ప్రారంభోత్సవం జరిగినది.
3. 17-10-2014 హుదూద్ తుఫాను సందర్భముగా విశాఖపట్నం జిల్లాలో దెబ్బతిన్న గ్రామాలకు పదిటన్నుల లారీలో 4 లక్షల విలువ గల నిత్యవసర సరుకులు బియ్యము, బట్టలు, పప్పులు, 6 గురు వాలంటీర్లను పంపి ఎనిమిది వందల కుటుంబాలకు పంచడం జరిగిది.
4. 12-08-2016 నుంచి 23-08-2016 వరకు జరిగిరి కృష్ణా పుష్కరాలకు ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య గారి ఆధ్వర్యంలో ముక్త్యాల గ్రామంలో జరిగిన అన్న ప్రసాద వితరణకు 3 లక్షల అరవై వేల రూపాయల నిధులు పంపించి రోజుకి 12 మంది వాలంటీర్లను 12 రోజులపాటు ముక్త్యాలకు వంపి భక్తులకు సేవలు అందించటం జరిగినవి.
5. 25-8-2018 కేరళ వరద బాధితులకు తన పొట్టి శ్రీరాములు సేవా ట్రస్ట్ ద్వారా 9 లక్షల రూపాయలు విలువ గల నిత్యవసర సరుకులను 1200 ప్యాకెట్స్ తయారు చేసి 32 టన్నుల లారీలో శ్రీరామ్ తాతయ్య గారి చేతుల మీదగా అక్కడకు వంపి రేషన్ కార్డు ద్వారా 1200ల కుటుంబాలకు కొట్టాయం జిల్లా చెట్టిపూజ, సింగంచెర్రీ మండవల్లి గ్రామంలో పంచటము జరిగినది.లారీ తో పాటు ఒక ట్రావెలర్ లో 12 మంది వాలంటీర్స్ ను కేరళ పంపించటం జరిగినది. వారి ద్వారా పకడ్బందీగా పంచటం జరిగింది.
6. వత్సవాయి మండలంలో ఉన్న జిల్లా పరిషత్తు పాఠశాల, గురుకుల పాఠశాల, ఖమ్మంపాడు పాఠశాల, చిన్నహైస్కూలు, మరియు అన్ని పాఠశాలలకు పొట్టి శ్రీరాములు సేవా ట్రస్ట్ తరుపున 8 లక్షల రూపాయల ఖర్చుతో విద్యార్థులకు వసతులు కోసం వెచ్చించటం జరిగినది.
7. వత్సవాయిలో ఉన్న వత్సవాయి అమ్మ తల్లి దేవాలయమునకు 10 సంవత్సరాలు పొట్టి శ్రీరాములు సేవా ట్రస్టు తరుపున 3 లక్షల రూపాయలు వెచ్చించి భక్తులకు ప్రసాదాలు, రవ్వ కేసరి, పులిహోర, మజ్జిగ, వాటర్ సప్లై చేయటం జరిగింది.
8. 3-05-2020 వ తారీఖున ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గారు చేతుల మీదుగా కరోనా సమయంలో 2200 వైట్ రేషన్‌కార్డు కుటుంబాలకు 8 లక్షల 50 వేలు విలువగల నిత్యవసర సరుకులు ప్రతి కుటుంబానికి అందజేయడం జరిగినది.
9. 22-02-22 వ తారీఖున దేవాదాయ శాఖ మాత్యులు వెల్లంపల్లి శ్రీనివాస్ గారి చేతుల మీదగా వాసవి నవ ఉపాలయాల క్షేత్రమును ప్రారంభించడం జరిగినది. సుమారు పదివేల మంది భక్తులకు 8 లక్షల రూపాయలు వెచ్చించి అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది.
10. 11-10-2023 మీ పెద్దనాన్న గారి పేరు మీద బొగ్గవరపు వెంకటేశ్వర్లు విజ్ఞాన కేంద్రము, నిరుద్యోగులకు స్కిల్ డెవలప్మెంట్స్ కోసం వత్సవాయి లో బిల్డింగు ఏర్పాటు కొరకు మీ పొట్టిశ్రీరాములు సేవా బ్రస్టు ద్వారా 3 లక్షల రూపాయలు ఇవ్వడం జరిగినది.
11. 18-03-2024వ తారీఖున ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా మీరు ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. ఆ కార్యక్రమమునకు పెద్దలు టీజీ వెంకటేష్ గారు, శ్రీరామ్ తాతయ్య గారు, జయంతి వెంకటేశ్వర్లు గారు, చిన్ని రామసత్యనారాయణ గారు, అంబికా కృష్ణ గారు, క్రేన్ వక్కపొడి కాంతారావు గారు పెద్దలందరు రావడం జరిగింది. ఈ కార్యక్రమమునకు 10 లక్షల రూపాయలు వెచ్చించి ఘనంగా చేయడం జరిగినది.
    మీ టీం లో ఉన్న 160 మంది సభ్యులకు వారి పదవులు మెన్షన్ చేస్తూ ఫోటో ఫ్రేమ్ కట్టించి అందించడం జరిగింది.
12. 5-9-2024వ బుడమేరు పొంగి విజయవాడలో పాయకాపురం, ప్రకాశ్ నగర్, శాంతి నగర్, సుందరయ్య నగర్, సింగ్ నగర్ మునిగినాని. సుమారు నాలుగు లక్షలు రూపాయలు విలువగల వాటర్ క్యాన్లు, నిత్యవసర సరుకులు, బట్టలు 500 కుటుంబాలకు మూడు అడుగుల వాటర్ లో ట్రాక్టర్ మీద ఇంటింటికి వెళ్ళి విజయవాడ రూరల్ ఆర్యవైశ్య సభ్యుల ద్వారా పంచటం జరిగినది.
13. మన ఆర్యవైశ్య సంఘంలోని పేద విద్యార్థులకు చదువుకునే నిమిత్తం సుమారు రెండు లక్షల రూపాయలు ఖర్చుతో 40 మందికి నగదు ఇవ్వటం జరిగినది. ఇవిగాక చాలా చిన్నచిన్న కార్యక్రమాలు గత 12 సంవత్సరాలుగా ప్రజలకు చాలా ఖర్చుతో మీ పొట్టి శ్రీరాములు సేవా ట్రస్ట్ తరపున భారీ ఎత్తున ఖర్చు చేసినారు. కావున మా ఎంక్వయిరీలో తెలిసినందున మీకు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ తరపున స్టేట్ అధ్యక్షుడిగా సేవా రత్న అవార్డును ప్రధానం చేస్తున్నాము.



శ్రీ బొగ్గవరపు వెంకట రాజారావు గారు
అధ్యక్షులు : (రాజా)
NTR జిల్లా ఆర్యవైశ్య సంఘం.

గత 17 సంవత్సరాలుగా కర్నూలు వరద బాధితులకు, హుదూద్ తుఫాన్ వరద బాధితులకు, కేరళ, బుడమేరు వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ, పలువురు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాలు, పలు దేవాలయాలకు విరాళాలు, శ్రీ వాసవి కళ్యాణ మండపం పునర్నిర్మాణం, శ్రీ వాసవి దేవాలయం నిర్మాణం, పలు పాఠశాలలకు సౌకర్యాలు కల్పన, దైవ కార్యక్రమాలలో ప్రసాదాల పంపిణీ, మీరు నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలపై శ్రీ వాసవి పెనుగొండలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు శ్రీ చిన్ని రామ సత్యనారాయణ గారి నుండి ది.8-02-2026 సేవారత్న అవార్డును స్వీకరించిన శుభ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు శ్రీ బొగ్గవరపు వెంకట రాజారావు (రాజా) గారికి హార్ధిక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.



**ఎన్.టి.ఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం, కార్యవర్గం, ఎన్.టి.ఆర్ జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం, ఎన్.టి.ఆర్ జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం మరియు వత్సవాయి మండల ఆర్యవైశ్య సంఘం.**

## సి ఎం ను కలిసిన టిటిడి ఈ వో రవి చంద్ర



**అమరావతి,కలంకౌంటర్ :** టీటీడీ ఈవోగా అదనపు బాధ్యతలు స్వీకరించిన సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర . సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల టీటీడీ ఈవో గా అదనపు బాధ్యతలు స్వీకరించిన రవిచంద్ర సీఎం ని కలిసి తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందించారు.

## ప్రారంభం





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక ప్రచార వాహనం( బాల్య వివాహ విముక్తి రథశీ)ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ .

## మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

- నీట్, ఈఏపీ సెట్ పరీక్షలకు 45 రోజుల శిక్షణ
- మైనారిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో నీట్, ఈఏపీ సెట్ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ విద్యార్థుల కోసం ఉచిత శిక్షణ ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. సోమవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఉచిత శిక్షణకు సంబంధించిన వివరాలను మంత్రి ఫరూక్ వెల్లడించారు. మైనారిటీ సంక్షేమ శాఖ నేతృత్వంలో, సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సీఈడీఎం) ద్వారా మైనారిటీ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. నీట్, ఈఏపీ సెట్ ల పోటీ పరీక్షల్లో ఉన్నతమైన మార్కులను సాధించి, మంచిర్యాంకులతో వైద్య, ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మా తదితర అండర్ గ్రాడ్యుయేషన్ ( యూజీ కోర్సులు) కోర్సుల్లో అడ్మిషన్ పొందేందుకు వీలుగా మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. ఉచిత శిక్షణను ఆన్ లైన్, ఆఫ్ లైన్ విధానాలలో 45 రోజుల పాటు అందించడం జరుగుతుందన్నారు. నీట్, ఈఏపీ సెట్ ల శిక్షణలో నిష్ణాతులైన అధ్యాపకుల చేత బోధనా తరగతులు నిర్వహించడం జరుగుతుందని మంత్రి ఫరూక్ తెలిపారు. ఈ అవకాశాన్ని మైనారిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సీఈడీఎం వెబ్ సైట్:: www.apcedmmwd.org లేదా విజయవాడ సీఈడీఎం కేంద్ర కార్యాలయం లో సంప్రదించాలన్నారు. అలాగే cedmap2017@gmail.com, ఫోన్ నెంబర్:0866-2970567, మొబైల్ నెంబర్ :73867 89966 సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని మైనారిటీ మంత్రి ఫరూక్ తెలిపారు.

# వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకూడదు... ముందస్తు చర్యలు తీసుకోండి

- హాస్టల్ విద్యార్థులకు అనారోగ్య సమస్యలు వస్తే కలెక్టర్లు, మంత్రులదే బాధ్యత
- నార్మల్ డెలివరీలు పెరిగేలా అవగాహన కల్పించండి
- త్వరలో పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ
- గత పాలకుల తప్పిదాల వల్ల అధిక వడ్డీలు చెల్లిస్తున్నాం
- క్షేత్ర స్థాయిలో పర్యటించి... పాలసీల అమలు పరిశీలించండి
- మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో సీఎం చంద్రబాబు









**అమరావతి, కలంకౌంటర్ :** వేసవి కాలం రానున్న నేపథ్యంలో నీటి ఎద్దడి అనేది తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఇప్పటి నుంచే సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్దం చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూసుకోవడంతోపాటు... పశువుల దాణాకూ సమస్యలు రాకూడదని సీఎం చెప్పారు. మరోవైపు ప్రజాసమస్యలు-పాలనా తీరు తెలుసుకునేందుకు మంత్రులు, కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో పర్యటించాల్సిందేనని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, పాలసీల అమలు క్షేత్ర స్థాయిలో ఎలా ఉందనే దానిని ప్రత్యక్షంగా చూడాలన్నారు. పైస్థాయిలో ఎన్ని నిర్ణయాలు తీసుకున్నా... క్షేత్ర స్థాయిలో పాలసీలు సమర్ధవంతంగా అమలు కానప్పుడు ఆశించిన ఫలితాలు రావని సీఎం అభిప్రాయపడ్డారు. వివిధ వర్గాల ప్రజలతో అధికారులు తరుచూ మాట్లాడుతూ ఉంటే చాలా సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయని ముఖ్యమంత్రి చెప్పారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో మంత్రులు, కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "ప్రతీ ఐదేళ్లకూ జీఎస్డీపీ, తలసరి ఆదాయం రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలి. తలసరి ఆదాయం ప్రజల జీవన ప్రమాణాలకు ప్రతీకగా నిలుస్తుంది. కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల విషయంలో జాగ్రత్తగా అంచనాలు వేయాలి. క్షేత్రస్థాయి నుంచి తీసుకునే సమాచారం ఒకటికి రెండు సార్లు పరిశీలన చేసుకోవాలి. పీ 4 అనేది రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తగ్గించే ప్రత్యేక కార్యక్రమం. మార్గదర్శులు బంగారు మిత్రలను నియమించుకోవాలి... వారి ద్వారా ఆయా పేద కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలి. గత పాలకులు చేసిన అప్పుల కారణంగా 14 శాతం వడ్డీ చెల్లిస్తున్నాం. ఏపీ క్రెడిట్ రేటింగ్ పెంచుకుని వడ్డీ తగ్గించుకునేలా రుణాలన్నీ రీషెడ్యూలు చేస్తున్నాం. గత పాలనలో పాలకులు 2019-24 మధ్య ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతీశారు. జీతాలు కూడా మొదటి తేదీకి ఇవ్వలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు జీతాల చెల్లింపులను గాడిలో పెట్టాం... సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం. కొన్ని జిల్లాల్లో అద్భుతమైన అభివృద్ధి జరుగుతోంది. భవిష్య త్తులో ఆ జిల్లాలు మరింత వృద్ధిలోకి వచ్చే అవ కాశాలు కనిపిస్తు న్నాయి. అల్లూరి జిల్లా లంబసింగిలో కుంకుమ పువ్వు ఉత్పత్తికి అవకాశాలు ఉన్నాయి. ఇప్పటివరకు కశ్మీర్లో మాత్రమే కుంకుమ పువ్వు ఉత్పత్తి జరుగుతోంది. అలాగే దేశంలో ఎక్కడా లేని విధంగా ఏలూరు సమీపంలో కోకో సిటీ కూడా ఏర్పాటు అవుతుంది. కాఫీ సాగు పెంచటంతో పాటు అరకు కాఫీ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్నాం.. ఇది మరింతగా పెరగాలి." అని సీఎం చంద్రబాబు వివరించారు.

**జూలై కల్లా 66 లక్షల హైరిస్క్ కేసుల హెల్త్ స్క్రీనింగ్..** "సంజీవని ద్వారా జూలై 2026 నాటికి 66 లక్షల హైరిస్క్ కేసుల హెల్త్ స్క్రీనింగ్ చేయాలి. 5 లక్షల మంది హాస్టల్ విద్యార్థుల స్క్రీనింగ్ చేపట్టాలి. 12వ తరగతి వరకూ ఉన్న 70 లక్షల మంది విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్స్ కూడా తయారు చేయాలి. కేర్ అండ్ గ్రో ద్వారా మాతా శిశు ఆరోగ్యం, ఎదుగుదలను నమోదు చేయాలి. పౌష్టికాహారం అందించటంతో సహా అవసరమైన సప్లిమెంట్స్ అందించేలా చర్యలు తీసుకోవాలి. అవిశ, మునగ, రకరకాల ఆకు కూరల్లో పౌష్టికాహారం లభిస్తుంది. వాటిని ఆహారంగా తీసుకోవడం మానేయడం వల్లనే సమస్యలు వస్తున్నాయి. మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీలు, అన్న క్యాంటీన్లలో కూడా పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలి. ఇక గర్భిణీల విషయంలో నార్మల్ డెలివరీలు పెరిగేలా చూడాలి... సిజేరియన్లు తగ్గాలి. ఈ మేరకు ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. ఫ్యామిలీ కార్డు బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా జూన్ నాటికి సమగ్రమైన కార్డు జారీ చేస్తాం. మార్చి నాటికి పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. జనాభా విషయంలో చాలా దేశాల్లో వృద్ధుల సంఖ్య బాగా పెరిగిపోయింది. యూరోప్‌లోని దాదాపు 20 దేశాల్లో ఈ సమస్య ఉంది. అక్కడ సామాజిక వేడుకలే లేవు." అని ముఖ్యమంత్రి చెప్పారు.

**ఒత్తిడి లేని విద్యాభోదనే లక్ష్యంగా...** "పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా 100 రోజుల యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలు చేయాలి. పరీక్షలు అంటే ఎలాంటి ఒత్తిడి లేని విధంగా ఈ కార్యాచరణ ఉండాలి. ఒత్తిడి కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోడానికి వీల్లేదు. ఒత్తిడి లేని విద్యా విధానంతోనే కొత్త ఆలోచనలు వస్తాయి... సరికొత్త ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుంది. వయోజన విద్యలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా డ్వాక్రా మహిళల సహకారం తీసుకోవాలి. కేంద్రం అమలు చేస్తున్న కర్మయోగి పథకంలో ఏపీకి చెందిన వారే అగ్రస్థానంలో ఉన్నారు. సామాజిక బాధ్యత కింద ప్రైవేటు సంస్థలు యువతకు నైపుణ్యాలను కల్పించే అంశంపై దృష్టి పెట్టాలి. నైపుణ్యం పోర్టల్ ద్వారా స్కిల్లింగ్ తో పాటు ఉద్యోగాలు ఏ మేరకు వస్తున్నాయనే అంశాన్నీ పర్యవేక్షించాలి. రాష్ట్రంలో 38,608 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు ఉన్నాయి. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల దగ్గర నీటి నిల్వలకు అనుగుణంగా ప్రణాళికలు చేయాలి. చెరువులు, కాల్వలు ఆక్రమణలకు గురి కాకుండా చూడాలి. దీంతో పాటు డీసిల్టింగ్, అటవీ ప్రాంతాల్లో ట్రెంచ్‌లను తవ్వాలి, నిల్వలు పెరిగేలా చూడాలి ప్రస్తుతం 7.34 భూగర్భజలాలు ఉన్నాయి. నీటి బ్యాంకు తరహాలో భూగర్భ జలాలు వినియోగం జరగాలి. వాటిని సద్వినియోగం చేసుకుంటేనే మెరుగైన ఫలితాలు సాధించగలం." అని సీఎం వివరించారు.

**జీ రామ్ జీ పనులపై కార్యాచరణ సిద్దం చేయాలి..** "పారిశ్రామిక కాలుష్యం ద్వారా భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూడాలి. సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందాలి. ఆశ్రమ హాస్టల్‌లో కలుషితమైన నీరు కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురైన పరిస్థితి ఎదురైంది. ఈ తరహా ఘటనలు ఇక రాష్ట్రంలో ఉత్పన్నం కాకూడదు. మళ్లీ ఇలాంటి సంఘటనలు జరిగితే... దానికి సంబంధిత జిల్లా కలెక్టర్, ఇంచార్జ్ మంత్రులదే బాధ్యత. పంచాయితీరాజ్ రోడ్లు, నీటి సంరక్షణా చర్యలు, గోకులం షెడ్లు, మేజిక్ డ్రెయిన్లు చేపట్టాలి."అని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజాను పూర్తిగా నియంత్రణలోకి తీసుకొస్తున్నాం

- ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లా సోడమ్ మండలం అమ్మగారిపల్లి, పుట్టవారిపల్లి గ్రామాల్లో గుర్తించిన ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా (పక్షి ఫ్లూ) కేసులపై ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు, భోపాల్ ప్రయోగశాల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా భారత ప్రభుత్వ పశుసంవర్ధక డ డెయిరీయింగ్ శాఖ ద్వారా ఫిబ్రవరి 8న వ్యాధి నిర్ధారణ జరిగినట్లు ఆయన వెల్లడించారు. నిర్ధారణ వెలువడిన వెంటనే ప్రభావిత ప్రాంతాల్లో రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ను మోహరించి, నిర్ణీత ప్రామాణిక కార్యాచరణ విధానాల ప్రకారం కట్టుదిట్టమైన కల్లింగ్ (తొలగింపు) చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రక్రియ జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో పశుసంవర్ధక, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో సమర్థవంతంగా కొనసాగుతున్నట్లు స్పష్టం చేశారు. వ్యాధి మరింత వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ప్రభావిత ప్రాంతాల్లోనే కాకుండా పరిసర ప్రాంతాల్లో కూడా పర్యవేక్షణను మరింత బలోపేతం చేసినట్లు తెలిపారు. చిత్తూరు జిల్లా కర్వేటినగరం మండలంలో పక్షుల అకస్మాత్తు మరణాల సమాచారం మేరకు క్షేత్రస్థాయిలో పశువైద్య బృందాలు పరిశీలనలు నిర్వహించి, నమూనాలను పరీక్షల కోసం, భోపాల్‌కు పంపినట్లు చెప్పారు. సంబంధిత రైతులకు అవసరమైన బయోసెక్యూరిటీ, ముందస్తు జాగ్రత్త చర్యలపై స్పష్టమైన సూచనలు అందించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఆదివారం రెండు పొలాలలో కల్లింగ్ ప్రక్రియ పూర్తయిందని మంత్రి తెలిపారు. ఈ రెండు ప్రాంతాల్లో భారత ప్రభుత్వం ద్వారా వ్యాధి నిర్ధారణ జరిగినట్లు వెల్లడించారు. సోడమ్ మండలం నుంచి ఒకటి, కర్వేటినగరం మండలం నుంచి మరో ఒకటి చొప్పున మొత్తం రెండు అదనపు నమూనాలను పరీక్షల కోసం భోపాల్ ప్రయోగశాలకు పంపినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయా నమూనాల పరీక్షా ఫలితాల కోసం అధికారులు వేచి చూస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు ఆదివారం కర్వేటినగరం ప్రాంతంలోని పొలాన్ని ప్రత్యక్షంగా సందర్శించి, సిబ్బందికి మరియు రైతులకు వ్యాధి నియంత్రణకు సంబంధించి పాటించాల్సిన ప్రోటోకాల్‌లు, బయోసెక్యూరిటీ చర్యలపై స్పష్టమైన మార్గనిర్దేశం చేశారని మంత్రి తెలిపారు. ప్రజలు ఎలాంటి భయం లేదా అపోహలకు లోనవ్వాల్సిన అవసరం లేదని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా అనేది పక్షులకు మాత్రమే సంబంధించిన వ్యాధి అని, సరైన విధంగా వండిన కోడి మాంసం మరియు గుడ్ల వినియోగం పూర్తిగా సురక్షితమని స్పష్టం చేశారు. ప్రభుత్వం అవసరమైన అన్ని నివారణ, నియంత్రణ చర్యలను పటిష్టంగా అమలు చేస్తోందని తెలిపారు. కోడి పెంపకదారులు బయోసెక్యూరిటీ చర్యలను కఠినంగా పాటించాలని, పక్షుల్లో ఏవైనా అసాధారణ మరణాలు గమనించిన వెంటనే సమీప పశువైద్య అధికారులకు తక్షణమే సమాచారం అందించాలని మంత్రి సూచించారు. వ్యాధిని సమర్థవంతంగా నియంత్రించేందుకు కోడి పెంపకదారులు, సాధారణ ప్రజలు పశుసంవర్ధక శాఖకు పూర్తి సహకారం అందించాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు.



# తెలంగాణలో ముగిసిన ఎన్నికల ప్రచారం.. ఎల్లుండి పోలింగ్

- రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు 11వ తేదీన పోలింగ్
- ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 వరకు పోలింగ్

ఈ నెల 13న ఓట్ల లెక్కింపు

**తెలంగాణ,కలంకౌంటర్ :** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎల్లుండి పోలింగ్ జరగనుంది. ఈరోజుతో ప్రచారం ముగియడంతో రాష్ట్రంలో మైకులు మూగబోయాయి. ఈ నెల 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అనివార్యమైతే ఈ నెల 12న రీపోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13 ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. గెలిచిన వారు మరుసటి రోజు వార్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుంది.

# ఉద్యోగుల సంక్షేమమే నా శ్వాస...

- ఉద్యోగుల ఆకాంక్షలకనుగుణంగా కార్యవర్గం పనితీరు...
- యువనాయకత్వాన్ని ప్రోత్సాహిస్తున్నాం...
- చట్టబద్ధ హక్కులను వదులుకోం...
- కీలక సమస్యల పరిష్కారమే మా ముందున్న లక్ష్యం...
- మీ నమ్మకాన్ని నిలబెట్టేందుకు నిబద్ధతతో పనిచేస్తాం
- ఏపీ ఎన్జీజీవో సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్, డివి రమణ



**విజయవాడ,కలంకౌంటర్ :** గత 75 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చట్టబద్ధంగా లభించాల్సిన హక్కుల సాధనలో ఏపీ ఎన్జీజీవో సంఘం అనుసరిస్తున్న విధానాల వల్లే సంఘం ఇప్పటికీ బలంగా పనిచేస్తోందని ఏపీ ఎన్జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. మూడు సంవత్సరాల కాల పరిమితితో నిర్వహించే రాష్ట్ర ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్ష కార్యదర్శులతో సహా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం గాంధీనగర్ లోని జింఖానా గ్రౌండ్స్ లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా హాజరైన ఉద్యోగులను ఉద్దేశించి విద్యాసాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చట్టబద్ధంగా లభించాల్సిన ప్రతి హక్కును పరిరక్షించేందుకు ఏపీ ఎన్జీజీవో సంఘం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వ పాలనా కాలంలో పేరుకుపోయిన ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వంతో దశల వారీగా చర్చలు జరిపిన ఫలితంగానే 50 శాతం బకాయిలు ఉద్యోగులు పొందగలిగారని గుర్తు చేశారు. ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సేవల అంశంలో ప్రభుత్వం నియమించిన కమిటీలో ఉద్యోగ సంఘాలకు కూడా కీలక పాత్ర పోషించే అవకాశం రావడం ఉద్యోగ సంఘాలకు లభించిన గౌరవమన్నారు. అతి త్వరలో ఆరోగ్య సేవల సమస్య సంతృప్తికర స్థాయిలో పరిష్కార మవుతుందన్నారు. తనకంటే ముందు అధ్యక్షులుగా పనిచేసిన వారి పనితీరును ఆదర్శంగా తీసుకుంటున్నామన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యో గుల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ వెనకడుగు వేయకుండా అవసరమైతే పోరాటాలకు కూడా ఎప్పుడూ సిద్ధంగా ఉండే ఏకైక సంఘం మనదేనన్నారు. ఒక సంఘం బలంగా ఉండాలంటే సైన్యాధ్యక్షుడుతో పాటు అనుసరించే సైన్యం కూడా యువశక్తితో ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర కార్యవర్గంలో యువతరాన్ని ప్రోత్సహిస్తున్నా మన్నారు. ఉద్యోగులకు ఎంతో కీలకమైన 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటులో మన సంఘం కీలకపాత్ర పోషించనుందన్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డివి రమణ మాట్లాడుతూ ఎంతోమంది లబ్ధ ప్రతిష్ఠుడైన నాయకులు నిర్వహించిన పదవికి తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న జిల్లా కార్యవర్గాలకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

# చిన్నశేషవాహనంపై శ్రీ వేణు గోపాల కృష్ణుడి అలంకారంలో కల్యాణ శ్రీనివాసుడు





**తిరుపతి,కలంకౌంటర్ :** శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన సోమవారం ఉదయం 8 గంటలకు శ్రీనివాసుడు శ్రీ వేణు గోపాల కృష్ణుడి అలంకారంలో చిన్నశేష వాహనంపై అభయమిచ్చారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. భక్తజన బృందాల కోలాటాలు, చెక్కభజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రెండో రోజు ఉదయం శ్రీ కల్యాణ వేంకటేశ్వరుడు ఒక్కరే ఐదు తలలు గల చిన్నశేష వాహనాన్ని అధిష్టించారు. చిన్నశేష వాహనం శ్రీవారి వ్యక్తరూపమైన పాంచభౌతిక ప్రకృతికి సంకేతం. కనుక ఈ వాహనం పంచభూతాత్మకమైన విశ్వానికి, అందులో నివసించే జీవునికి వరాలిస్తుంది. విశ్వం కన్పించే శ్రీవారి ప్రకృతి. విష్ణువు ఈ ప్రకృతికి ఆధారమై దాన్ని నడిపించేశక్తి. స్వామి విశ్వాన్ని రక్షించేవాడు కనుక శేషునిపై తానొక్కడే విహరిస్తాడు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు హంస వాహనంపై స్వామివారు దర్శనమివ్వనున్నారు. వాహనసేవలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో శ్రీమతి వరలక్ష్మి, ఏఈవో శ్రీ గోపినాథ్, సూపరింటెండెంట్ శ్రీ రమేష్, కంకణబట్టార్ శ్రీ బాలాజి రంగాచార్యులు,టెంపుల్ ఇన్స్పెక్టర్లు శ్రీ మునికుమార్, శ్రీ ధన శేఖర్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అంబటి రాంబాబుకు బెయిల్ మంజూరు.. అయినా జైలుకే!


● సీఎంపై వ్యాఖ్యల కేసులో అంబటి రాంబాబుకు బెయిల్ ● విడుదలవుతున్న సమయంలోనే మరో కేసు తెరపైకి ● పోలీసులతో దురుసు ప్రవర్తన కేసులో 14 రోజుల రిమాండ్ ● ఈ నెల 22 వరకు అంబటికి జ్యుడీషియల్ కస్టడీ ● తిరిగి రాజమహేంద్రవరం జైలుకే అంబటి



**అమరావతి, కలంకౌంటర్ :** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఒక కేసులో ఊరట లభించినా, ఆయన జైలు నుంచి ఇప్పట్లో విడుదలయ్యే అవకాశం కనిపించడం లేదు. సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కేసులో గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు ఇవాళ ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన జైలు నుంచి బయటకు వస్తారని అంతా భావించారు. అయితే, ఆయన బెయిల్‌పై విడుదలవుతున్న సమయంలోనే పట్టాభిపురం పోలీసులు మరో కేసులో రంగప్రవేశం చేశారు. గతంలో పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై నమోదైన కేసులో పీటీ వారెంట్‌పై అంబటిని స్పెషల్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం, ఆయనకు 14 రోజుల పాటు అంటే ఈ నెల 22 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. సీఎంపై వ్యాఖ్యల కేసులో ఈ నెల 1న అరెస్టయిన అంబటి, అప్పటి నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉంటున్న విషయం తెలిసిందే. తాజాగా ఒక కేసులో బెయిల్ వచ్చినా, మరో కేసులో రిమాండ్ పడటంతో పోలీసులు ఆయన్ను తిరిగి రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. కాగా, అంబటి రాంబాబుపై రాష్ట్రవ్యాప్తంగా సుమారు 36 కేసులు నమోదైనట్లు సమాచారం.

# ఇక రెవెన్యూ కష్టాలకు చెక్

● రైతుల ఇబ్బందులు తొలిగేలా చర్యలు ● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వెల్లడి ● లింగసముద్రంలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణి ● అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచన



కందుకూరు,**కలంకౌంటర్ :** రైతుల రెవిన్యూ కష్టాలకు ఫుల్ స్టాప్ పెట్టేలా కూటమి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వం కొత్తగా ముద్రించిన పట్టాదారు పాసుపుస్తకాలను లింగసముద్రంలో ఆయన రైతులకు పంపిణీ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సభలో ఆయన పాస్ పుస్తకాలను రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రీ సర్వే కార్యక్రమంలో ఇష్టం వచ్చినట్లు రికార్డులు తయారుచేసి, రైతులందరికీ కొత్త సమస్యలు తెచ్చి పెట్టారని విమర్శించారు. అధికారులపై ఒత్తిడితెచ్చి రీ సర్వేను హడావుడిగా చేయించారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలను తీర్చే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే గారు చెప్పారు. మొదటగా పాసుపుస్తకాలపై జగన్ ఫోటోను తొలగించి, రాజముద్రతో కూడిన పుస్తకాలను ప్రస్తుతం అందిస్తున్నామని, చిన్న చిన్న సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించాలని, అంతకు మించిన సమస్యలను మాత్రమే సబ్ కలెక్టర్ కోర్టుకు వెళ్లేలా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. రెవిన్యూ అధికారులు ప్రస్తుత రీ సర్వే విషయంలో మరింత బాధ్యతగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలకతీతంగా రైతులందరికీ న్యాయం చేయాలని, సున్నితమైన సమస్యలను తన దృష్టికి వెంటనే తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎమ్మార్వో హనుమాయమ్మ, ఎంపీడీవో కట్ట శ్రీనివాసరావు, మండల ఎడ్యుకేషన్ అధికారి మాల్యాద్రి, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు..

# స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వం చాటుకున్న షేక్ బాబుల్లా మరియు నీరుకొండ వెంకటేష్

**కందుకూరు,కలంకౌంటర్ :** ఒంగోలులోని కిమ్స్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న ఒక పేషెంట్ కి హార్ట్ సర్జరీ నిమిత్తం అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం అని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న బ్లడ్ డోనర్స్ వాట్సాప్ గ్రూప్ సభ్యులు కందుకూరు పట్టణం బూడిద పాలెంకి చెందిన షేక్.బాబుల్లా, వలేటివారిపాలెం మండలం కూనిపాలెం గ్రామానికి చెందిన నీరుకొండ వెంకటేష్ లు వెంటనే స్పందించి స్వచ్ఛందంగా కందుకూరు నుండి ఒంగోలు వెళ్లి రక్తదానం చేసారు. ఆపద సమయంలో ఆదుకున్న షేక్.బాబుల్లా మరియు నీరుకొండ వెంకటేష్ లకు పేషంట్ తరపు బంధువులు కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కందుకూరు రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ చైర్మన్ చన్నా వెంకట రామాంజనేయులు మాట్లాడుతూ స్వచ్ఛందంగా రక్తదానం చేసిన షేక్.బాబుల్లా మరియు నీరుకొండ వెంకటేష్ లు అభినందనీయులు అని ప్రశంసించారు. రక్తదానం ప్రాణదానం తో సమానం అని ఆరోగ్యవంతమైన యువత అందరూ రక్తదానం చేయాలి అని కోరారు.





# క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు,కలంకౌంటర్ :** పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో... కందుకూరు ప్రీమియర్ లీగ్ పోటీలను స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ రాష్ట్రస్థాయి పోటీలలో మొత్తం 24 టీములు పోటీ పడుతుండగా, ఆయా జట్ల క్రీడాకారులను ఎమ్మెల్యే నాగేశ్వరరావు పరిచయం చేసుకున్నారు. క్రీడల ప్రారంభానికి ముందు ఎమ్మెల్యే కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి ఆటలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని ఆటలకు కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఉద్యోగ నియామకాలకు సంబంధించి స్పోర్ట్స్ కోటా శాతాన్ని పెంచిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. యువకులు క్రీడల్లో సత్తా చాటి కందుకూరుకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆకాంక్షించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలోగా కందుకూరులో క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే నాగేశ్వరరావు క్రీడాకారుల హర్షద్వానాల మధ్య ప్రకటించారు. తగిన స్థలాన్ని ఎంపిక చేసి, తన సొంత నిధులతో ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. 2014 -19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో, ఇదే ప్రాంగణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి అడుగు పడిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. 75 శాతం నిర్మాణం టిడిపి హయాంలోనే పూర్తయిందని, కాగా గత వైసిపి ప్రభుత్వంలో కనీసం రేకులను కూడా ఏర్పాటు చేయలేకపోయారని ఎమ్మెల్యే విమర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, షేక్ సలాం, షేక్ సలాం, షేక్ మున్నా, షేక్ ఫిరోజ్, షేక్ ఖాదర్బాషా, షేక్ ఖాదర్ వలీ, కేపీఎల్ టోర్నమెంట్ కమిటీ నిర్వాహకులు షేక్ జలీల్, షేక్ రియాజ్, కె చిరంజీవి, షేక్ మస్తాన్ వలి,షేక్ నాయబ్ రసూల్ నాగరాజు పాల్గొన్నారు.

# ఆహ్వానం





**బంటుమిల్లి,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సన్నిధి నాగ సాయి శ్రీనివాస్ (సాయి) బృందం బంటుమిల్లి మండలంలో పర్యటించారు.ఈ నెల 22 న డాక్టర్ కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ మహోత్సవం కు ప్రతి ఒక్కరూ రావాలని ఆహ్వాన పత్రికలు అందజేశారు.



# లంకిశెట్టి దాతృత్వం



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం ఈడేపల్లి జోడుగుడుల దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా జరుగు స్వామి వారి శివకల్యాణం, హోమాలు, కాలభైరవ పూజల కరపత్రాన్ని ప్రముఖ న్యాయవాది జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లంకిశెట్టి బాలాజీ కి దేవస్థాన చైర్మన్ వీరబాబు, వైస్ ప్రెసిడెంట్ డివిజన్ ఇంచార్జ్ మహమ్మద్ సమీర్ స్వామివారి కల్యాణం కరపత్రాన్ని అందించారు. అనంతరం లంకిశెట్టి బాలాజీ స్వామివారి అన్నదానానికి 5000 రూపాయల విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రామ్ జ్యోతి, కోటి తదితరులు పాల్గొన్నారు.

# మేడారం హుండీల లెక్కింపు... ఐదు రోజుల్లో రూ.11.83 కోట్ల ఆదాయం

● ఐదు రోజుల్లో 788 హుండీల లెక్కింపు ● ఈరోజు 163 హుండీలను లెక్కించగా 1.12 కోట్ల ఆదాయం ● మిగిలిన హుండీల లెక్కింపునకు మరో రెండు రోజులు పట్టే అవకాశం

**తెలంగాణ, కలంకౌంటర్ :** మేడారం సమ్మక్క సారక్క జాతరకు సంబంధించిన హుండీల లెక్కింపు కొనసాగుతోంది. నేటితో హుండీల లెక్కింపు ఐదో రోజుకు చేరుకుంది. ఇప్పటి వరకు 788 హుండీలను లెక్కించగా రూ.11.83 కోట్ల ఆదాయం వచ్చింది. ఈరోజు 163 హుండీలను లెక్కించగా రూ.1.12 కోట్ల ఆదాయం సమకూరింది. మిగిలిన హుండీల లెక్కింపునకు సుమారు రెండు రోజులు పట్టవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. మంత్రి కొండా సురేఖ గత గురువారం కొబ్బరికాయ కొట్టి హుండీల లెక్కింపును ప్రారంభించారు. క్రితంసారి మేడారం జాతర ద్వారా రూ.13 కోట్ల ఆదాయం సమకూరింది. హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో లెక్కిస్తున్నారు. హుండీల లెక్కింపు పూర్తయ్యాక బంగారం, వెండి వస్తువుల విలువను నిర్ధారిస్తారు.



# ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడాలి

**● ఉదాసీనత వీడండి.. పారదర్శకతే మా విధానం ● ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

**అమరావతి, కలంకౌంటర్ :** 'కూటమి ప్రభుత్వం ప్రజలకు పారదర్శకమైన పాలన, అభివృద్ధి, సంక్షేమం అందించేందుకు నిబద్ధతతో పని చేస్తోంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి అనుభవం మార్గదర్శకాలుగా ముందుకు వెళ్తున్నాం. దీనికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాల్సిన అవసరం ఉంద'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. నాలుగు గోడల మధ్య మంత్రులు, ఉన్నతాధికారులు తీసుకునే ప్రజోపయోగ నిర్ణయాలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అర్ధవంతంగా అందాలంటే అంతా సమష్టిగా పనిచేయాలని సూచించారు. సోమవారం సచివాలయంలో మంత్రులు, శాఖల కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో కలిసి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం విషయంలో రాజీపడటం లేదు. కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకొని అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఖజానా నుంచి ఖర్చు చేసే ప్రతి రూపాయి విలువైనదే. పెట్టే ఖర్చు, దానివల్ల అందే ప్రయోజనం ప్రజలకు ఉపయోగపడేలా క్షేత్రస్థాయి సిబ్బంది పని చేయాలి. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి.



**రూ.వేల కోట్ల పనులను మొదలుపెట్టాం..** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మౌలిక సదుపాయాలు, సౌకర్యాల కల్పన మీద దృష్టిపెట్టాం. దీనిలో భాగంగా మొదటి విడత పల్లె పండుగ కార్యక్రమం కింద రూ.2,500 కోట్లు, పల్లె పండుగ 2.0 కింద రూ.5,700 కోట్లు ఖర్చు చేశాం. గిరిజన ప్రాంతాల్లో సౌకర్యాలను మెరుగుపర్చే కార్యక్రమం 'అడవి తల్లి బాట' పథకం కింద రూ.1005 కోట్లను వెచ్చించాం. దీంతోపాటు సాస్కీ నిధులు రూ.2,123 వేల కోట్లతో నియోజక వర్గాల్లో ప్రాధాన్యతను బట్టి పనులు చేస్తున్నాం. మొత్తంగా రూ.11,328 కోట్లతో చేస్తున్న పనులను నిత్యం పర్యవేక్షిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన జల్ జీవన్ మిషన్ పథకం కింద రూ.28 వేల కోట్ల పనులకు అనుమతులు లభిస్తే, దానిలో రూ.10 వేల కోట్ల పనులను ప్రారంభించాం. ఇక అటవీ శాఖ పరిధిలో రూ.200 కోట్లతో నగరవనాలను ఏర్పాటు చేస్తున్నాం. ఇంకా అనేక పనులను పారదర్శకంగా క్రమపద్ధతిలో, ప్రాధాన్యతలను అనసరించి చేస్తున్నాం.

**నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలి..** అందుబాటులో ఉన్న ఆర్థిక వనరులతో పనులను క్రమపద్ధతిలో చేస్తున్నాం. మొదలుపెట్టిన పనులను ఓ ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి. నిర్దేశిత సమయంలో పనులను పూర్తి చేయడం అవసరం. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల అమలు, పనుల పూర్తి విషయంలో క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. కొన్ని ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రభుత్వం అప్పగించిన పనిని నిబద్ధతతో నిజాయతీగా పూర్తి చేయండి. ప్రభుత్వ నిర్ణయాల అమలు, పనులు జరుగుతున్న తీరు విషయంలో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తే కొన్ని లోపాలు కనిపిస్తున్నాయి. దీనిని అధిగమించాలి. ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బందికి పనుల పూర్తి విషయంలో దిశానిర్దేశం చేయాలి. నిర్ణయాలను అమలు చేసే బృహత్తర బాధ్యతలు క్షేత్రస్థాయి సిబ్బంది మీదనే ఉన్నాయి. దాన్ని సరైన రీతితో నిర్వర్తించండి. ప్రభుత్వం మీకు తగిన విధంగా సహకరిస్తుంది" అన్నారు.

# ధ్వజారోహణం





**శ్రీశైలం,కలంకౌంటర్ :** ధ్వజారోహణ కార్యక్రమములో ఉత్సవాల ప్రత్యేక అధికారి ఎస్.ఎస్. చంద్రశేఖర ఆజాద్, దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు దేవకి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీనివాసమంగాపురం బ్రహ్మోత్సవాల్లో ఆకట్టుకుంటున్న విద్యుత్ కాంతులు, పుష్పాలంకరణలు







**తిరుపతి,కలంకౌంటర్ :** శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా టీటీడీ చేపట్టిన విద్యుత్ కాంతులు, పుష్పాలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. శ్రీనివాసమంగాపురం పరిసర ప్రాంతాలు, జాతీయ రహదారులు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు భక్తులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. ఇవి బ్రహ్మోత్సవాల వైభవాన్ని కొత్త ఎత్తులకు తీసుకెళ్తూ పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సవంగా మారుస్తున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చిన్న, మధ్య, పెద్ద పరిమాణాల్లో సుమారు 75కు పైగా అద్భుతమైన ఇల్యూమినేషన్ బోర్డులు ఏర్పాటు చేశారు. నాలుగు మాడ వీధులలో గరుత్మంతుడిపై మహావిష్ణువు, లక్ష్మీదేవి, ఆభరణాల వేంకటేశ్వర స్వామి, వినాయకుడు, లక్ష్మి, గజవాహనం, ఆదిశేషుడిపై మహావిష్ణువు, దశావతారాలు, అష్టలక్ష్మి తదితర రూపాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అదేవిధంగా, శ్రీనివాసమంగాపురం --చెర్లోపల్లి పరిసర ప్రాంతాల్లో దశావతారాలు, అష్టలక్ష్ములు, శ్రీవేంకటేశ్వర స్వామి, మహావిష్ణువు--లక్ష్మీదేవి, గజవాహనంపై లక్ష్మీదేవి, శంఖు--చక్రాలు, ఏనుగులు, కమలాలు, వారాహావతారం, తోరణాలు, చిన్న లక్ష్మీదేవి రూపాలు, అభయహస్తం, వజ్రకిరీటం, కటిహస్తం, నైన్ వాట్స్ తోరణాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. చెర్లోపల్లి--శ్రీనివాసమంగాపురం, చంద్రగిరి--కాలూరు మార్గాలు, జాతీయ రహదారుల వెంట ఎల్.ఈ.డి లైట్లతో డిజైన్ చేసిన ఆర్చ్‌లు ఏర్పాటు చేశారు. పుదిపట్ల జంక్షన్, శ్రీనివాసమంగాపురం--తిరుపతి పరిసరాలు, ఆలయ పుష్కరిణి, ఆలయం లోపల మరియు వెలుపల, నాలుగు మాడ వీధులు, కార్ పార్కింగ్ ప్రాంతం, శ్రీనివాసమంగాపురం--నరసింగాపురం జంక్షన్, చంద్రగిరి బస్టాండ్, శ్రీనివాసమంగాపురం రైల్వే గేట్ తదితర ప్రాంతాలు రాత్రి వేళల్లో రజతంలా మెరిసిపోతూ బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక శోభను అందిస్తున్నాయి. బ్రహ్మోత్సవాల నిర్వహణకు మూడు నెలల ముందుగానే టీటీడీ ఎలక్ట్రికల్ శాఖ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది విద్యుత్ అలంకరణల ఏర్పాట్లను చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారు. శ్రీనివాసమంగాపురం అంతటా విద్యుత్ కాంతుల వెలుగులు భక్తుల హృదయాలను ఆకట్టుకుంటున్నాయి.

**మైమరిపిస్తున్న పుష్పాలంకరణలు..** శ్రీనివాసమంగాపురం ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు అలంకరణకు దాదాపు 10 టన్నుల పుష్పాలను వినియోగించనున్నారు. ఇందులో సంప్రదాయ పుష్పాలతో పాటు విదేశీ జాతుల పుష్పాలు కూడా ఉన్నాయి. వాహన సేవల సందర్భంగా స్వామి, అమ్మవార్లను సువాసనభరితమైన పుష్పాలతో విశేషంగా అలంకరించనున్నారు. ఆలయం ముందు వివిధ రకాల పుష్పాలతో ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు, స్వామి మరియు అమ్మవార్ల రూపాలను ప్రతిబింబించే పుష్ప బోర్డులు భక్తులను ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. విద్యుత్ కాంతులు, పుష్పాలంకరణల సమ్మేళనంతో శ్రీనివాసమంగాపురం ఆలయ పరిసరాలు దివ్య కాంతులతో వెలిగిపోతున్నాయి.

# జిల్లాలో ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలి - జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జిల్లాలో ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు సోమవారం సాయంత్రం నగరంలోని కలెక్టరేట్ విసి హాలులో జిల్లా కలెక్టర్ భారతీయ రిజర్వ్ బ్యాంక్ (RBI) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9 నుండి 13 తేదీ వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవం సందర్భంగా, ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంపొందించేందుకు రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ప్రజలు సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో ఆర్థిక అక్షరాస్యత ఎంతో కీలకమని, సురక్షిత బ్యాంకింగ్ విధానాలు, డిజిటల్ లావాదేవీలు, పొదుపు అలవాట్లు మరియు ఆర్థిక మోసాల నుంచి రక్షణపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ వారోత్సవం ద్వారా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు బాధ్యతాయుత ఆర్థిక ప్రవర్తనపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, ఎల్డిఎం రవీంద్రారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 192 అర్జీలు

**● 54 రెవెన్యూ, 138 నాన్ రెవెన్యూ అర్జీలు ● ప్రతి అర్జీకి ప్రత్యేక దృష్టితో పరిష్కారం ● జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ**

**విజయవాడ,కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జిల్లాస్థాయి కార్యక్రమం ద్వారా మొత్తం 192 అర్జీలు వచ్చాయని.. వీటిలో 54 రెవెన్యూ అర్జీలు కాగా 138 రెవెన్యూయేతర అర్జీలు ఉన్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ.. అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నాన్ రెవెన్యూ అర్జీల్లో పురపాలక శాఖకు సంబంధించి 31, పోలీసు శాఖకు 27, డీఆర్‌డీఏకు 25, పంచాయతీరాజ్ శాఖకు 12 అర్జీలు వచ్చాయన్నారు. విద్యుత్, పౌర సరఫరాలు, ఆరోగ్య శాఖలకు అయిదు చొప్పున అర్జీలు రాగా సీఆర్‌డీఏకు సంబంధించి నాలుగు అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. వ్యవసాయం, ఇరిగేషన్‌కు మూడు చొప్పున అర్జీలు రాగా, విద్య, నైపుణ్యాభివృద్ధి, సర్వే, సాంకేతిక విద్యకు రెండు చొప్పున అర్జీలు వచ్చాయన్నారు. ప్రజా రవాణా, ఎండోమెంట్, మైనారిటీ సంక్షేమం, ఎల్‌డీఎం, పరిశ్రమలు, మైన్స్, కాలుష్య నియంత్రణ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, గ్రామీణ నీటి సరఫరా, రహదారులు-భవనాల శాఖలకు ఒకటి చొప్పున అర్జీలు వచ్చాయని వివరించారు. ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించి నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యకు సరైన పరిష్కారం చూపడంలో చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.



# హృద్రోగంకు గురైన వారికి సి.పి.ఆర్.తో పునర్జన్మను అందించవచ్చు

**– విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్**





**విజయనగరం,కలంకౌంటర్ :** సుఖీభవ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆర్మ్డ్ రిజర్వు పోలీసు సిబ్బందిని సి.పి.ఆర్. లో సుశిక్షులను చేసేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – సమాజానికి మెరుగైన సేవలందించేందుకు పోలీసు సిబ్బందిని సి.పి.ఆర్. నిర్వహించుటలో సుశిక్షులను చేసేందుకు సుఖీభవ ఆసువత్రి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఏదైనా రహదారి ప్రమాదం లేదా మరేదో సంఘటన జరిగినట్లుగా సమాచారం అందిన వెంటనే ఫ్రంట్ లైను వారియర్ సంఘటనా స్థలానికి చేరేది పోలీసులేనన్నారు. సంఘటనా స్థలంలో గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న వారికి అవసరాన్ని బట్టి గోల్డెన్ అవర్స్ లో సి.పి.ఆర్. చేస్తే, వారికి పునర్జన్మ అందించిన వారమవుతామన్నారు. అయితే, సి.పి.ఆర్. ఎప్పుడు, ఎలా, ఎంతసేపు నిర్వహించాలన్న విషయాలపై తప్పనిసరిగా పూర్తి అవగాహన ఉండాలన్నారు. వైద్యులు సూచించిన పద్ధతిలో సి.పి.ఆర్. నిర్వహిస్తే, సత్ఫలితాలిస్తుందన్నారు. రెగ్యులర్ జీవితంలో మన బంధువులు లేదా చుట్టు ప్రక్కల వారికి లేదా అపస్మారక స్థితిలో ఉన్న వారికి అవసరమైన సందర్భాల్లో సి.పి.ఆర్. నిర్వహించే విధానం పట్ల పోలీసు సిబ్బందిని సుశిక్షులను చేసేందుకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అన్నారు. సుఖీభవ ఆసుపత్రి వైద్యులు డా॥ పి.ఎస్.వి.రామారావు మాట్లాడుతూ– ఏ పరిస్థితుల్లో సి.పి.ఆర్. అందించాలన్న విషయం పట్ల అవగాహన అవసరమన్నారు. గుండె నుండి రక్త ప్రసరణ ఆగిపోయినపుడు గుండె కొట్టుకోవడం ఆగిపోతుందని, కార్డియక్ అరెస్టును గుర్తించి, సకాలంలో స్పందించి సి.పి.ఆర్. చేస్తే, తిరిగి గుండెపని చేస్తుందని, తద్వారా మనిషి ప్రాణాలను నిలపవచ్చునన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సుఖీభవ ఆసుపత్రి వైద్యులు డా॥ పి.ఎస్.వి.రామారావు రిజర్వు ఇన్స్పెక్టర్లు ఎన్.గోపాల నాయుడు, ఆర్.రమేష్ కుమార్, టి.శ్రీనివాసరావు, సుఖీభవ ఆసుపత్రి టెక్నికల్ సిబ్బంది, మార్కెటింగు ఎగ్జిక్యూటివ్ సత్తిబాబు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com